# జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, మాలగుండ్ల శంకరనారాయణ


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి


సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

**అమరాపురం:** పార్టీలకు అతీతంగా సంక్షేమం పథకాలు మంజూరు చేస్తూ ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ సీఎంగా చేసుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పిలుపునిచ్చారు. నిద్రగట్ట గ్రామ సచివాలయం పరిధిలోని యర్రగుంటపల్లి, హెచ్‌బీఎస్ కాలనీలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. తమ ఇంట్లో తొలిసారిగా జగన్ ప్రభుత్వంలో మూడు, నాలుగు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందామని పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే తమ కుంటుంబానికి కొండంత భరోసా కల్పించాయని ఎమ్మెల్యేకు వివరించారు. సచివాలయం పరిధిలో పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం అమలు చేసి ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, డైరెక్టర్లు గగన, రాజేశ్వరి, లక్ష్మీదేవి, సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, లలితమ్మ, ఎంపీటీసీ అనసూయ, వైఎస్సార్‌సీపీ నాయకులు గుజ్జారప్ప, మంజునాథ, రాజు, శివలింగప్ప, పీఆర్‌మూర్తి, నారాయణ, ప్రసాద్, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా పేదలకు సంక్షేమ ఫలాలు

**గోరంట్ల:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పేదలకు పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గంగంపల్లి గ్రామ పంచాయతీలోని ఎగువ గంగంపల్లి, దాసిరెడ్డిపల్లి తండా, కుంట్లో తండా గ్రామాల్లో సర్పంచ్ సుశీలమ్మ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత పేదలకు చేకూరుతున్న లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు రాజకీయ లబ్ధి కోసం ఆరు వందలకు పైగా ఆచరణ సాధ్యంకాని హామీని ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదాలో పాదయాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టారన్నారు.

**పేదల అభ్యున్నతే జగన్ ధ్యేయం..**

గత ప్రభుత్వ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్ల ద్వారా కులమత రాజకీయలకతీతంగా పేదలకు పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. ఎంపీపీ ప్రమీల, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఎంపీటీసీ సభ్యుడు రంగారెడ్డి, నాయకులు నాగభూషణరెడ్డి, శివశంకరరెడ్డి, వాసుదేవరెడ్డి, శ్రీనివాసనాయక్, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అంకితభావంతో పనిచేసినప్పుడే సంతృప్తి


స్పెషల్ న్యాయమూర్తి ఆనందతీర్థను సన్మానిస్తున్న ఏడీజే శైలజ

**హిందూపురం:** అంకితభావంతో పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించడమే ఉద్యోగి కర్తవ్యమని హిందూపురం ఏడీజే కె.శైలజ అన్నారు. స్పెషల్ మెజిస్ట్రేట్ ఆనందతీర్థ పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఆయనకు ఏడీజేతోపాటు కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులు దుశాలువలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆనందరావు, సూపరింటిండెంట్ వెంకటేష్, బార్‌అసోసియేషన్ ప్రతినిధులు సిద్ధూ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి పనులపై కూలీలకు అవగాహన


రొద్దం పెద్ద చెరువు వద్ద కూలీలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**రొద్దం:** మండలంలోని పెద్దకోడిపల్లి, కోగిర, ఎం.కొత్తపల్లి, నారనాగేపల్లి తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలకు అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం పనుల వద్ద రోజ్‌గార్ దివస్ (వేతనదారుల దినోత్సవం) కార్యక్రమం నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంట్ నరసయ్య మాట్లాడుతూ ఉపాధి పథకంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, పథకాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయడానికి రోజ్‌గార్ దివస్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు షామీర్‌బాషా, కూలీలు తదితులు పాల్గొన్నారు.

### 'ఇంటి పట్టాలు ఇవ్వండి'

**లేపాక్షి:** మండల కేంద్రంలోని ఎస్‌ఆర్ కాలనీలో 2013 నుంచి ఇళ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని, వారికి పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శివప్ప, సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి, సహాయ కార్యాదర్శి గౌతమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల స్థలంలో ఆక్రమణ తొలగింపు

**రొద్దం:** మండలంలోని తాడంగిపల్లి ప్రాథమిక పాఠశాల స్థలంలో ఆక్రమణను గ్రామస్తులు తొలగించారు. పాఠశాల స్థలంలో అదే గ్రామానికి చెందిన వెంకటరమణ బండలు పాతినట్లు గ్రామస్తులు చెప్పారు. నాడు–నేడు ద్వారా పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు హెచ్‌ఎం రంగనాయక్ తెలిపారు. ఆక్రమణలు తొలగించాలని హెచ్‌ఎం, అధికారులు చెప్పినా పట్టించుకోకపోవడంతో శుక్రవారం గ్రామస్తులు ఏకమై పాఠశాల స్థలంలో అక్రమంగా పాతిన బండలను తొలగించారు.

### ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

**పావగడ:** స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ 47వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్ఎస్‌కే బయలు రంగ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పావగడ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ వేడుకల్లో అతని తండ్రి మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప, సోదరుడు కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు సుదేశ్ బాబు, రామాంజినప్ప, మానం వెంకటస్వామి, శంకరరెడ్డి, బత్తినేని నాని, రాజేశ్, మహ్మద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శ్రీ సాయి లలిత వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే వృద్ధులకు పాలు, పండ్లు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో యువకులు రక్త దానం చేశారు.


**ఉష్ణోగ్రత సమాచారం**
(గరిష్ఠం)
హిందూపురం : 36.0
పెనుకొండ : 40.0
మడకశిర : 36.0

### నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

**పరిగి:** మండలంలోని బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న గొల్లపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీడీఓ సరస్వతి శుక్రవారం తెలిపారు. గ్రామంలో ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతారన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పరిగి:** పెద్దిరెడ్డిపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు.సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 వరకూ సబ్‌స్టేషన్ పరిధిలోని శాసనకోట, ఎం.చెర్లోపల్లి, మోదా, శ్రీరంగరాజుపల్లి, ముల్లమోతుకపల్లి, పాపిరెడ్డిపల్లి, పెద్దిరెడ్డిపల్లి, పుట్టగూర్లపల్లి, గొరవనహళ్లి, కోనాపురం, కొడిగెనహళ్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

# అల్లా కృపతోనే హజ్‌యాత్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

**హిందూపురం:** అల్లా కృపతోనే హజ్ యాత్ర చేయగలమని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. స్థానిక ఆజాద్‌నగర్ వద్ద జరిగిన హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక దువా వీడ్కోలు కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభిమానంతో అన్ని సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అంతేగాక సొంత రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు బయలు దేరాలన్న ముస్లింల మనోవాంఛను నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తమకోసం అద్భుత ఏర్పాట్లు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలని యాత్రికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జామియా ముతవల్లి నూరుల్లా, మహమ్మద్ రఫీక్, మాజీ ముతవల్లి కలీం, వైస్‌చైర్మన్ జబీవుల్లా కౌన్సిలర్లు ఈర్షద్ అహ్మద్, ముస్తక్, అయుబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు లతీఫ్, కట్టబాషా, దాదు, చంద్‌బాషా, ఆర్‌కే ఖలీల్, ఇలియాజ్, బాబు, హబీబ్, నౌషాద్, హుమయూన్, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేద్దాం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

**హిందూపురం:** మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రూ.10 కోట్ల నిధులతో చేపడుతున్న వంద అభివృద్ధి పనులు మూడు నెలల్లో పూర్తి చేయడానికి మున్సిపల్ కాంట్రాక్టర్లు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పెండింగ్ పనులతో పాటు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన 31 అభివృద్ధి పనులు కూడా పూర్తి చేసి మిగిలిన ఉన్న 9పనులకు టెండర్లలో పాల్గొనాలని కోరారు. ప్రతి కాంట్రాక్టర్ జగనన్న కాలనీల్లో వంద ఇళ్లు మించి నిర్మించడానికి ముందుకు రావాలన్నారు. ఇప్పటి వరకూ చేపట్టిన పనులన్నింటికి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసిందన్నారు. చేపడుతున్న పనులకు వెంటనే బిల్లులు మంజూరు జరిగేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఈర్షద్ అహ్మద్, వెంకట ప్రసాద్, మల్లికార్జున, ఆసీస్‌వుల్లా, జయరాముడు, రోషన్, నాయకులు దాదు, నాగరాజు, చంద్ర, మున్సిపల్ అధికారులు, అనిమేటరీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ యువతకు శిక్షణ

**హిందూపురం:** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు యువతీ, యువకులకు నిర్మాణ రంగంలో శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. స్థానిక ముక్కిడిపేటలోని పాత ఎస్సీ బాలుర హాస్టల్‌లో 70 రోజుల పాటు రోజూ నాలుగు గంటలు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఎన్ఏసీఅండ్ ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా సర్టిఫికెట్ అందించి ప్రైవేట్, ప్రభుత్వ నిర్మాణ రంగ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మరింత సమాచారం కోసం అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు(9908620306)ను సంప్రదించాలన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో 'కార్పొరేట్' విద్య


ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే శంకరనారాయణ

**పెనుకొండ రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యను బోధిస్తున్నట్లు ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. శుక్రవారం పెనుకొండ సెంట్రల్ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రదానోత్సవ సభ ఏర్పాటు చేశారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ సాధించిన కొడిగెనహళ్లి ఏపీ ఆర్ఎస్ విద్యార్థి డి. ఇలాహి (పదోతరగతి 590 మార్కులు)కి రూ.15వేలు నగదు, 588 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన టి.నరసింహనాయుడుకు రూ.10వేలు, 587 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిన యం.లక్ష్మీవసంత్‌కు రూ.5వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఇంటర్‌మీడియట్‌లో మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థి జి.సంతోష్ (కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్)కు రూ.15వేలు, 976 మార్కులు సాధించిన ఆర్ అచ్యుతానంద్‌నాయక్, 957 మార్కులు సాధించిన బి.రామ్‌చరణ్‌తేజ్, 646 మార్కులు సాధించిన ఎం.వంశీకృష్ణకు ఎమ్మెల్యే చేతులమీదుగా మెడల్, మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ గీతా, మండల విద్యాధికారి గంగప్ప, ప్రధానోపాధ్యాయురాలు కవిత, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునిల్, పట్టణ కన్వీనర్ నరసింహులు, కౌన్సిలర్లు సద్దాం, బోయ బాబు, రఘునాథరెడ్డి, తయ్యూబ్, గణప్ప,శేషాద్రి, నాయకులు వెంకటేశులు, గోపాల్, కాంట్రాక్టర్ గంగాధర్ నాయక్ పాల్గొన్నారు.

### 'అధిక ఫీజు వసూళ్లపై చర్యలు తీసుకోండి'

**హిందూపురం టౌన్:** అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఇందిరా పార్కులో విద్యార్థి జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యజమానులు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఫీజు స్ట్రక్చర్‌ను నోటీసు బోర్డులో అతికించాలని, కానీ ఏ ఒక్క పాఠశాలలో అలా పాటించడం లేదన్నారు. అలాగే పాఠశాల ఆవరణలోనే అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారన్నారు. జిల్లా పరిధిలోని గుర్తింపు లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులను నిలిపివేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేషన్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు కేటాయించాలని కోరారు. సమావేశంలో విద్యార్థి జేఏసీ నాయకులు సంపత్ కుమార్, బాబావలి, చంద్రశేఖర్‌రెడ్డి, అభిలాష్, జయచంద్ర, హరీష్‌లు పాల్గొన్నారు.

### ఉపాధి పనుల పరిశీలన

**గుడిబండ:** కె.కె.పాళ్యం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హమీ పనులను ఎంపీడీఓ రామారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్లను పరిశీలించారు. ఏపీఓ భార్గవి, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

### రొళ్ల ఎంపీడీఓగా ఆజాద్

**రొళ్ల:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓగా అజాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న రామారావు గుడిబండకు వెళ్లారు. రామగిరి ఎంపీడీఓగా పని చేస్తున్న ఆజాద్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ క్రిష్టప్ప, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు, బీజీ హళ్లి సర్పంచ్, సదాశివప్ప ఎంపీడీఓకు స్వాగతం పలికారు.

## సంక్షిప్త సమాచారం

**అరుణాచల దర్శనానికి ప్రత్యేక బస్సు**

**హిందూపురం టౌన్:** ఆర్టీసీ ఆధ్వర్యంలో స్థానిక డిపో నుంచి అరుణాచల దర్శనానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు డీఎం శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక బస్టాండ్ నుంచి అరుణాచలానికి బస్సు బయలుదేరుతుందన్నారు. మరిన్ని వివరాలకు రిజర్వేషన్ కౌంటర్ (8977225997), డిపో మేనేజర్ (9959225858)ను సంప్రదించాలని ఆయన సూచించారు.

**నెల రోజుల్లోనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్**

**హిందూపురం అర్బన్:** హిందూపురం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని రైతులు దరఖాస్తు చేసుకోవడంతోపాటు తగిన రుసుము విద్యుత్ శాఖకు చెల్లిస్తే 30 రోజుల్లోనే కొత్త వ్యవసాయ కనెక్షన్ ఇస్తామని హిందూపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) డి.భూపతి తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

**రొళ్ల:** గ్రామాల్లో మలేరియాపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మడకశిర డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా సీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బందితో కలిసి మలేరియా నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ**

**మడకశిరరూరల్:** నీలకంఠాపురంలో టీటీడీ సహకారంతో నీలకంఠాపురం దేవస్థానములు పేరుతో కల్యాణ మండపం నిర్మాణానికి శుక్రవారం ఆలయ కమిటీ చైరన్ రఘువీరారెడ్డి, టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దివాకర్ పురోహితులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ రఘువీరారెడ్డి మాట్లాడుతూ టీటీడీ, సహకారంతో దాదాపు రూ.6 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. తన సోదరుడు చలువమూర్తి రూ.కోటి నిధులు అందించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కాంట్రాక్టర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**పావగడ:** గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐఈసీ సంయోజకులు ఉమేశ్ హులికుంట ప్రజలకు సూచించారు. తాలూకా లోని కన్మేడిలో శుక్రవారం నిర్వహించిన అమృత ఆరోగ్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పీడీఓ రాఘవేంద్ర, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు నరసింహయ్య,ఐఈసీ కార్యకర్తలు పాల్గొన్నారు.


**ఘనంగా కళాశాల వార్షికోత్సవం**

**మడకశిర రూరల్:** ప్రభుత్వ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్ హేమకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల 15వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గుంటూరు, మడకశిర వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్‌లు మణి, హేమకుమార్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని సులభతరం చేసి రైతుల ఆదాయం రెట్టింపు చేయటం వ్యవసాయ ఇంజనీర్లతోనే సాధ్యమన్నారు. డీన్ కే నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**విషాహారం తిని గేదెలు మృత్యువాత**

**పరిగి:** కొడిగెనహళ్లి బీసీ కాలనీకి చెందిన పాడిరైతు గంగాధరప్పకు చెందిన గేదెలు విషాహారం తిని మృత్యువాత పడినట్లు బాధితుడు తెలిపాడు. శుక్రవారం ఉదయం గేదెలకు ముసర, ఇతర పదార్థాలు పెట్టాడు. తిన్న వెంటనే ఒక గేదె నోటి నుంచి రక్తం కక్కుతూ కుప్పకూలాయి. అందులో ఒకటి అప్పటికప్పుడే మృతిచెందగా, మరో గేదెకు పశు వైద్యులు చికిత్స చేస్తుండగా మృతిచెందింది. రెండు గేదెల మృతితో దాదాపు రూ.1.50 లక్షకు పైగా నష్టపోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

**విద్యార్థిని అదృశ్యం**


వనజ (ఫైల్)

**రొళ్ల:** హొట్టేబెట్టలో ఓ విద్యార్థిని అదృశ్యమైంది. పోలీసుల వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా నంద్యాలంపల్లి గ్రామానికి చెందిన వనజ హొట్టేబెట్టలోని తన మేనత్త నాగమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటోంది. ఈమె ఇటీవల టెన్త్ ఫెయిల్ కావడంతో ఇటీవల జరిగిన సప్లిమెంటరీ పరీక్ష రాసింది. ఈక్రమంలో ఈనెల 12న ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. శుక్రవారం బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని బాలిక కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

**ధరణి సొసైటీ ఆధ్వర్యంలో కల్లం ఏర్పాటు**

**రొద్దం:** మండలంలోని చెరుకూరులో టింబక్టు–కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పడిన ధరణి రైతుల సొసైటీ ఆధ్వర్యంలో వివిధ పంటలు ఆరబెట్టుకోవడానికి శుక్రవారం కల్లం ఏర్పాటు చేశారు. సంస్థ ప్రతినిధి మేరీ గంగూలి, అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

**కానిస్టేబుళ్లకు సన్మానం**

**పెనుకొండ:** పెనుకొండ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ సునీన్‌నాయక్, మహిళా కానిస్టేబుల్ శ్రావణిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది దాదాపీర్, మాలతి తదితరులు పాల్గొన్నారు.

**19న స్పందన**

**పెనుకొండ:** ఈనెల 19న మండల కేంద్రంలో స్పందన కార్యక్రమం ఉంటుందని సబ్‌కలెక్టర్ కార్తీక్ శుక్రవారం తెలిపారు. డివిజన్ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు.

**ఘనంగా గ్రాడ్యుయేషన్ డే**

**గోరంట్ల:** మండలంలోని కుంట్లోతండా అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత ఆధ్వర్యంలో జన భాగిదారీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు , గర్భిణులు, బాలింతలకు ఎలాంటి పోషకాహారం అందిస్తారో తెలియజేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరై అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు సరిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశీలమ్మ, సీపీఐ సుబ్బరాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**లేపాక్షి:** మండలంలోని పులమతి పంచాయతీ పరిధిలో వున్న తిలక్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సీడీపీఓ రెడ్డిరమణమ్మ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న 15 మంది విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించడానికి సిఫార్సు చేసి సర్టిఫికెట్‌లను జారీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమ్మ, ప్రధానోపాధ్యాయుడు విశ్వేశ్వరయ్య, అంగన్‌వాడీ కార్యకర్త వసుంధర తదితరులు పాల్గొన్నారు.

**వ్యక్తిపై దాడి**

**హిందూపురం అర్బన్:** మండలంలోని సంతేబిదనూరులో శుక్రవారం రాత్రి చంద్రశేఖర్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి కత్తితో దాడి చేయడంతో మెడ వద్ద తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ ఆజీద్ ఆస్పత్రికి చేరుకొని ఘర్షణకు గల కారణాలు ఆరా తీశారు. ముందస్తుగా గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.

**జూదరుల అరెస్ట్**

**గుడిబండ:** తాళకెర గ్రామ సమీపంలో శుక్రవారం 10 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు మడకశిర సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. నిందితుల నుంచి 4 బైక్‌లు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

**గడ్డి వాముల దగ్ధం**

**సోమందేపల్లి:** మండలంలోని రూకలపల్లిలో రెండు గడ్డి వాములను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ నెల 14న కిష్టప్ప అనే రైతు ఇంటి వద్ద గడ్డి వాము దగ్ధం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూపింది. శుక్రవారం తెల్లవారుజామున మారుతీరామ్‌రెడ్డికి చెందిన వరి, రాగి గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. బాధితులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.